జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 21-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 432 పేజీలు: 4 వెల : రూ.7



# అచ్చెన్నా.. ఇదేంటన్నా?

*** రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుపై అవినీతి ఆరోపణలు * ఓ అధికారి లేఖతో మొత్తం బట్టబయలు * ఏపీ అగ్రోస్ జీఎం రాజమోహన్‌కు నెల్లూరు బదిలీ * దోపిడీకి సహకరించలేదని బదిలీ చేశారని సీఎంకు లేఖ * అచ్చెన్నాయుడుపై విమర్శలు గుప్పిస్తున్న వైసీపీ నేతలు**

**శ్రీకాకుళం, ఆగస్టు 20 (వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ ఆగ్రోస్ జనరల్ మేనేజర్ రాజమోహన్ బదిలీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. మంత్రి అచ్చెన్నాయుడు అవినీతికి సహకరించలేదనే కోపంతోనే రాజమోహన్‌పై కక్షకట్టారని, దీని వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉందని వైసీపీ ఆరోపిస్తుంది. వ్యవసాయ యంత్ర పరికరాల తయారీదారులతో మధ్యవర్తిత్వం చేయాలని మంత్రి పేషీ నుంచి జీఎం రాజమోహన్‌పై తీవ్ర ఒత్తిడి వచ్చిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కానీ, రాజమోహన్ ఈ అవినీతికి సహకరించడానికి నిరాకరించడంతో, ఆగమేఘాలపై అతన్ని నెల్లూరుకు బదిలీ చేశారని వైసీపీ నేతలు అంటున్నారు. ఈ బదిలీకి అర్హత లేని, గతంలో అవినీతి ఆరోపణలున్న ఒక జూనియర్ అధికారిని జీఎం పోస్టులో నియమించుకున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. తనకు జరిగిన అన్యాయంపై రాజమోహన్ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఒక లేఖ రాశారు. ఈ అడ్డగోలు దోపిడీకి సహకరించలేదని తనను ఇలా బదిలీల పేరుతో వేధిస్తున్నారని ఆయన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. సెలవుపై వెళ్లడం తప్ప తనకు మరో మార్గం లేదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష వైసీపీ అధికార కూటమిని టార్గెట్ చేసుకుని విమర్శలు గుప్పిస్తోంది. ఇదేనా మంచి ప్రభుత్వం? ఇదేనా నిజాయితీ? అంటూ వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ ఆరోపణలపై మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ వర్గాలు ఎలా స్పందిస్తాయో చూడాలి. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త వివాదానికి తెర తీసినట్టయింది.

## అచ్చెన్న అవినీతిపై దర్యాప్తు చేపట్టాలి: వైసీపీ నేత పేరాడ తిలక్

**టెక్కలి/సంతబొమ్మాళి, ఆగస్టు20 (వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అవినీతిపై బహిరంగ దర్యాప్తు చేపట్టాలని, సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలిలోని వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై అందజేసే వ్యవసాయ పనిముట్లలోను అచ్చెన్నాయుడు తన ఓస్‌డీ పోలి నాయుడుతో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. పనిముట్లు తయారు చేసే కంపెనీలతో మధ్యవర్తిత్వం వ్యవహరించి డబ్బులు వసూలు చేయాలని ఆగ్రో జీఎంపై ఒత్తిడి తీసుకువచ్చారన్నారు. ఆ పని చేయలేనన్న జీఎంను నెల్లూరుకు బదిలీ చేశారన్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టానని చెప్పు కుంటున్న అచ్చెన్నాయుడు రైతులను నిలువెత్తున ముంచుతూ రైతుకు రావలసిన సబ్సిడీలో అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై దర్యాప్తు చేయించి మంత్రివర్గం నుంచి అచ్చెన్నాయుడిని భర్తరఫ్ చేయాలన్నారు. నందిగాం మండలంలో నిర్మాణం పూర్తయిన విత్తనోత్పత్తి కేంద్రానికి మిగతా సదుపాయాలు కల్పించకుండా వదిలేశారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే టెక్కలిని జిల్లా కేంద్రంగా చేస్తానని



హామీ ఇచ్చిన అచ్చన్నాయుడు నేడు ఎందుకు ఆ ప్రతిపాదన చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురునాథ్ యాదవ్, సంతబొమ్మాళి జడ్పిటిసి సభ్యులు పాల వసంత రెడ్డి, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపతిరావు హేమసుందర రాజు, తమిరి ఫాల్గుణరావు, వైసీపీ నాయకులు కిల్లి అజయ్, పోలాకి మోహనరావు కర్ణిక జీవన్, పేరాడ వెంకట్రావు, బమ్మిడి కూర్మారావు, పినకాన వైకుంఠరావు, టంకాల హిమాకర్, టంకాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## రచ్చబండపై విద్యా బోధన

*** బంజీరుపేటలో శిథిలావస్థకు చేరిన పాఠశాల * ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**

**నందిగాం, ఆగస్టు 20 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న తంతుకు ఎక్కడ కూడా పొంతన కుదరడం లేదు. నందిగాం మండలం సైలాడ పంచాయతీ బంజీరుపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. అక్కడ విద్యాబోధన కష్టంగా మారింది. దీంతో గ్రామంలోని రచ్చబండ వద్ద ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. పాఠశాల దుస్థితిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## రానున్న 25 ఏళ్లలో వికసిత్ భారత్

*** బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**శ్రీకాకుళం, ఆగస్టు 20(వార్త):** రానున్న 25 ఏళ్లలో వికసిత భారత్‌గా భారత్ అవతరిస్తుందని ఈ సంకల్ప దీక్షలో అందరూ భాగస్వామ్యం కావాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బుధవారం సన్‌రైజ్ హోటల్‌లో శ్రీకాకుళం జిల్లా శాఖ ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతీ ఇంటిలో వెలుగులు నింపేందుకు.. వివిధ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో వుండాలని ప్రజలు గుర్తించే విధంగా కార్యకర్తలు తయారు కావాలని సూచించారు. ట్రంప్ నిర్ణయాల వల్ల భారత్‌కు నష్టం వాటిల్లిందని మాధవ్ అన్నారు. తొలుత కోడిరామ్మూర్తి విగ్రహానికి మాధవ్ పూలమాల వేశారు. అనంతరం ఏడు రోడ్ల కూడలి నుండి సన్ రైజ్ హోటల్ సభా వేదిక వరకూ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్.ఈశ్వరరావు, బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, నాయకులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాలరావు, పూడి తిరుపతిరావు, పోకతోట సింహాచలం, అట్టాడ రవిబాబ్జి, వివిధ హోదాలో ఉండే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పెద్ద కొవ్వాడలో పోలీసుల పల్లెనిద్ర

**రణస్థలం, ఆగస్టు 20(వార్త):** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణరావు.. సిబ్బందితో కలిసి పెద్ద కొవ్వాడ గ్రామంలో బుధవారం పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మత్స్యకారులతో రాత్రిపూట బస చేశారు. అనుమానిత వ్యక్తులు, తీవ్రవాదులు, దేశ వ్యతిరేక శక్తుల ప్రమాదాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనుమానిత, గుర్తు తెలియని వ్యక్తులు తారసపడినా, నిషేధిత మాదక ద్రవ్యాలు తీరం వెంబడి రవాణా చేసినా కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1093 కళింగపట్నం ఎస్. హెచ్. ఓ. వారి నెంబర్ 9392914712 సమాచారం ఇవ్వాలని సూచించారు.



# క్షేత్రస్థాయిలో పనితీరు మార్చుకోకపోతే ఇంటికే

**-తప్పుడు మస్తర్లతో వేతనాలు చెల్లింపులు**

**-నిద్దాం క్షేత్రసహాయకునికి షోకాజ్ నోటీస్ జారీకి ఆదేశాలు**

**-లోటుపాట్ల గుర్తింపునకు సామాజిక తనిఖీ**

**-పీడీ బి.సుధాకర్**



**జి.సిగడాం, ఆగస్టు 20(వార్త):** మండలంలో ఉపాధి హామీ పనుల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు సామాజిక తనిఖీలో పలు నివేదికలను చదివి వినిపించారు. ఉపాది పనులలో క్షేత్రస్థాయిలో మండల అధికారు పర్యవేక్షణ లోపంతో పనిచేస్తున్నారని సామాజిక తనిఖీలో కనబడుతుంది. మండలంలో పలు గ్రామాలలో తప్పుడు మస్తర్లు వేసి వేతనాలు చెల్లింపులు చేసారని, మృతి చెందిన వ్యక్తికి కూడా మస్తర్లు వేసారని,జాబు కార్డు కోసం అదికారులు మధుఫాం డబ్బులను ఓ వ్యక్తిని అడుగుతున్నారని నివేదికను చదివి వినిపించారు. ఎవరైనా ఉపాధి హామీ జాబు కార్డు కోసం డబ్బులను అడిగితే వెంటనే ఎంపీడీవోకు లేదా సంబంధిత జిల్లా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని పీడీ బి.సుధాకర్ తెలిపారు. తప్పుడు మస్తర్లతో పాటు మస్తర్ల దిద్దుబాటు చేసి వేతనాలు చెల్లించారని డీఆర్పీలు వివరించారు. మ్రరివలసలో మృతిచెందిన వ్యక్తికి మస్తర్లు వేసారని డీఆర్పేలు చదివి వినిపించారు. బుధవారం స్థానిక మండ పరిషత్ కార్యాలయ ఆవరణలో 17వ విడత మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిను నిర్వహించారు.

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు, లోటుపాట్లు గుర్తించేందుకే ప్రతిఏడాది సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని డ్వామా పీడీ బి.సుధాకర్ తెలిపారు.ఈ సందర్భంగా మండలంలో 31 పంచాయతీల్లో చేపట్టిన 1190 అభివృద్ధి పనులకు గాను డీఆర్పీల నివేదిక చదివి వినిపించారు.వేతనాలు రూ.18కోట్ల 39 లక్షలు, మెటీరియల్ రూ.6కోట్ల 53 లక్షల ఖర్చు జరిగినట్లు తెలిపారు.మండలంలో గల క్షేత్రసహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరుపై పీడీ అగ్రహం వ్యక్తం చేసారు.

నిద్దాం క్షేత్రసహాయకునికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆయన ఎంపీడీవోకి ఆదేశించారు. ప్రభుత్వ దనం విచ్చలవిడిగా తమకు నచ్చినట్లు మస్తర్లు వేసి వేతనాలు చెల్లించటానికి మీరే మైనా ప్రభుత్వ ధర్మకర్తలా అని మండపడ్డారు. సమావేశంలో ఏపీడీ, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, మండల ప్రత్యేకాహ్వానితులు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాధరావు,ఎస్ఆర్పీలు, డీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చోరీకి పాల్పడిన మహిళ అరెస్టు

**మెళియాపుట్టి, ఆగస్టు 20(వార్త):** ఈనెల 14న పట్టుపురం గ్రామంలో అంబలి కాంచన ఇంట్లో ఒడిశాకు చెందిన గుర్తు తెలియని మహిళ చోరీ చేసే ప్రయత్నంలో ఆమెను తలపై చెక్కతో గాయపరిచి బైక్‌పై పారిపోయింది. దీనిపై కాంచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దాడి చేసిన మహిళ గూర్చి గాలింపు చర్యలు చేపట్టారు. 19న వసుంధర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న నేపథ్యంలో మనుజ మల్లిక్‌ను మెళియాపుట్టి పోలీసులు పట్టుకొని ప్రశ్నించగా నేరం అంగీకరించింది. దీంతో ఆమెను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఆమె వద్ద నుంచి చోరీ సమయంలో ఉపయోగించిన స్కూటీ, దాడికి పాల్పడిన కర్ర చెక్క, ఆమె ధరించిన బురఖాను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, పాతపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామారావు తెలిపారు.

## అనర్హత పేరుతో దివ్యాంగులకు అన్యాయం



**మందస, ఆగస్టు 20(వార్త):** అనర్హత పేరుతో దివ్యాంగులకు అన్యాయం చేశా రని వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి భాస్కం ౕరావు ఆరోపించారు. మందస మండలంలోని సొండిపూడి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో తొలగించిన 1.458 దివ్యాంగ పింఛన్లు చాలామంది తీవ్రమైన వైకల్యంతో బాధపడుతున్నటువంటి వారు ఉన్నారన్నారు. సకలాంగులు దివ్యాంగులుగా పింఛను పొందుతున్నారని, వారిని తొలగించౕకుండా తీవ్రమైన వైకల్యంతో బాధపడుతున్నటువంటి దివ్యాంగులను తొలగించ డం చాలా అన్యాయమన్నారు. అప్పీల్ పేరుతో మళ్లీ దివ్యాంగులను ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిప్పడం.. దివ్యాంగులకు చేసిన అన్యాయమన్నారు. తక్ష ణమే ప్రభుత్వం స్పందించి, దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన దివ్యాంగుల ఉపకరణాలు పలాస నియోజకవర్గంలో తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

# ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



**మందస, ఆగస్టు 20(వార్త):** ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ మండేలా రామారావు హెచ్చరించారు. మందస పట్టణంలోని ఎరువుల దుఖాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుఖాణదారులు తప్పక ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. బోర్డులు పెట్టిన అనంతరం మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. ఎరువులను అధిక ధరలకు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులకు ఎరువులు ఎక్కువగా అవసరం ఉంటుందని, ఈ తరుణంలో కృత్రిమ కొరత సృష్టించడం.. స్టాక్ లేదంటూ, అధిక ధరలకు అమ్మడం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువుల అమ్మకాలు చేయాలన్నారు.

**'పొలం పిలుస్తోంది' సద్వినియోగం చేసుకోవాలి**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ పలాస అసిస్టెంట్ డైరక్టర్ మండేలా రామారావు, మందస వ్యవసాయాధికారి జి.నాగరాజు కోరారు.

మందస మండలంలోని కొత్తపల్లి, సొండిపూడిలలో పర్యటించి, పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివ రించారు. అధిక దిగుబడి సాధించాలంటే ఏ విధంగా పంటలను పండించాలో తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు పుష్యా ఉదయ్ కుమార్, కొండల జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

## మహిళా రక్షణే శక్తి యాప్ ధ్యేయం



**జలుమూరు, ఆగస్టు 20 (వార్త):** అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్ అవగాహన కార్య క్రమాన్ని బుధవారం నిర్వహించారు. శక్తిటీం ఇన్చార్జి గిరిధర్ యాప్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యాప్ పనిచేస్తుందని, మహిళా రక్షణే ప్రధాన ధ్యేయమని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు, సిబ్బంది ఉన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

**పోలాకి, ఆగస్టు 20(వార్త):** ప్రియా గ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు వారు విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ప్రస్తుతం సమాజంలో జరుగుతున్నటువంటి పరిస్థితులపై పోలీసు వారు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు మరియు పోలాకి ఎస్సై జి.రంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగం పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కోరారు.సిఐ శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్లానింగ్ తో కూడిన హార్డ్ వర్క్ చేస్తే మంచి విజయాలు సాధించవచ్చు అని తెలిపారు.అలాగే మొబైల్ వాడకం, డ్రగ్స్, అతివేగంగా వాహనాలు నడపటం, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.జగదీశ్వరరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.




## 12 వ వార్డులో ఫాగింగ్

**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** మున్సిపాలిటీ పరిధి 12 వ వార్డు బెల్లు పడాలో ఫాగింగ్ చేపట్టారు. ఇటీవలి నాలుగు రోజుల గా కురుస్తున్న వర్షాలకు దోమలు బెడద అధికం కావడం తో అంటు వ్యాధులు ప్రబలకుండా కమిషనర్ రమేశ్ ఆదేశాలు మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ ఫోరిడా పర్యవేక్షణలో ఫాగింగ్ యంత్రంతో వెదచల్లారు.



## ప్రమాదం మొక్కే పాకుతోంది


**నందిగాం, ఆగస్టు 20(వార్త):** కొత్త అగ్రహారం గ్రామానికి వెళ్లే దారిలో ఓ విద్యుత్ స్తంభానికి పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో ఈదురు గాలులకు తరచూ సంఫరాలో అంతరాయం కలుగుతుంది. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలానే ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకముందే సిబ్బంది చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ జేఈ నేతాజీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పనికిరాని మొక్కలను తొలగిస్తామన్నారు.



# 22న బహడపల్లిలో ప్రపంచ జానపద దినోత్సవం

**-వ్యాసరచన, సామాజిక, జానపద పాటల పోటీల నిర్వహణ**

**మందస, ఆగస్టు 20(వార్త):** ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సామాజిక, జానపద పాటల పోటీలను నిర్వహిస్తున్నట్టు సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక నాయకులు చెప్పారు. జానపద కళల పునరుజ్జీవనే ధ్యేయంగా, జానపద కళలకు జవసత్వాలు కల్పిస్తూ, ఎంతో మంది జానపద కళాకారులను బయటి ప్రపంచానికి పరిచయం చేసి, మిక్కిలి ప్రజాధారణ పొందిన జానపద కళా సంస్థగా వెలుగుతున్న ' సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక' ఆధ్వర్యంలో 22 ఆగస్టు 2025 న శ్రీకాకుళం జిల్లా, మందస మండలంలోని బహడపల్లి గ్రామంలో జరుగుతున్న ప్రపంచ జానపద దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. మధ్యాహ్నం 2గంటలకు హైస్కూల్ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై జరుగుతాయని, బహుమతులుగా ప్రథమ రూ.2వేలు, ద్వితీయ రూ.1500, తృతీయ రూ.1000లు, జ్ఞాపికలు అందజేయబడుతుందన్నారు. సాయంత్రం 6గంటల నుండి జానపద, సామాజిక పాటల పోటీలు జరుగుతాయని, ఈ పోటీలో పాల్గొనడానికి అందరూ అర్హులేనని, స్త్రీ, పురుషులకు ఒకే విభాగంలో బహుమతులు ఇవ్వబడుతుందని, న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయమన్నారు. ప్రథమ రూ.2వేలు, ద్వితీయ రూ.1500, తృతీయ రూ.1000లు, జ్ఞాపికలు అందజేయబడుతుందన్నారు. రాత్రి 9గంటలకు వ్యాసరచన, పాటల పోటీల విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను ప్రముఖులకు అందజేశారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మామిడి క్రిష్ణారావు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, కోశాధికారి జి. లోకేశ్వరరావు కోరారు. వివరాలకు బత్తిని రామారావు(9704013483), సాలిన పాపారావు(8978204953) సంప్రదించాలని సూచించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఉచిత బస్సుతో వీధిన పడ్డ ఆటోడ్రైవర్లు



**సారవకోట, ఆగస్టు 20(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మహిళలకు ఉచిత బస్సు పాస్ మంజూరు చేయడంతో ఆటోలు నే నమ్ముకుని కుటుంబాలను పోషిస్తున్న తమ బ్రతుకులో బుగ్గి పాలు పోసారని పలువురా ఆటో డ్రైవర్ ఆందోళన చెందారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా మండల కేంద్రంసారవకోట ప్రధాన రహదారిపై వీరందరూ సమావేశమయ్యారు. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోతే ఆత్మహత్య శరణ్యమని అంటున్నారు.



## జిఎస్‌టి పరిమితి పెంచాలి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** జి ఎస్ టి వార్షిక టర్నోవర్ పెంచాలని జిల్లా బి జే పి ట్రేడ్ సెల్ కన్వీనర్ జి. సాయి కామేష్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రం లో రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ కు వినతిపత్రం అందజేశారు. 40 లక్షల నుంచి కోటి రూపాయలు కు పెంచాలని కోరారు. దాని ద్వారా చిరు వ్యాపారులకు ఊరట కలుగుతుందని అన్నారు. నిరుద్యోగులకు మేలు జరుగుతుందని అన్నారు.స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి రుణాలు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆనంద్, విశ్వం,జోగరావు, కృష్ణ, దుర్యోధన పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



**వీరఘట్టం, ఆగస్టు 20(వార్త):** వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు .వీరఘట్టం హైస్కూల్లో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర విషయ నిపుణులు జి .లక్ష్మణరావు పదవ తరగతి విద్యార్థుల కోసం కష్టమైన అంశాలను సులభంగా నేర్చుకునేలా తయారు చేసిన ఫీజికల్ సైన్స్ మెటీరియల్ ను విద్యార్థులకు ఉచితంగా పంపిణి చేసారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సోంబర మాట్లాడుతూ అత్యంత సామర్ధ్యం కలిగి ఎన్నో పుస్తకాలు రచించిన లక్ష్మణ రావు మాస్టర్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన ఈ మెటీరియల్ ను అందరు చక్కగా ఉపయోగించుకుని రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అందరు మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మరో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు రామారావు, సీనియర్ బయలజి ఉపాధ్యాయులు అన్ను వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## డిగ్రీ ఫలితాల్లో స్వర్ణభారతి విద్యార్థిని ప్రతిభ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ సెకండ్ సెమిస్టర్2025 ఫలితాల్లో స్వర్ణ భారతి డిగ్రీ కాలేజీ కంప్యూటర్ సైన్స్ హానర్స్ విభాగానికి చెందిన విద్యార్థిని అమీషా కుమారి సహాని 9.38 గ్రేడ్ పాయింట్లు సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసు కుందని యాజమాన్యం తెలిపింది. మరియు ఈమె పదిలో 565, ఇంటర్మీడియట్లో 955 మార్కులు సాధించి ప్రతి ఏటా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుందని చైర్మన్ చాట్ల తులసి దాస్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో చాట్ల రాము రెడ్డి, కోఆర్డినేటర్స్ మహేశ్వరి రెడ్డి , నీలిమ రెడ్డి, మరియు డిగ్రీ,జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ లు సందీప్, జయప్రకాష్ మరియు ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొని ప్రత్యేకంగా అభినందించారు.

## రాజీవ్‌కి కాంగ్రెస్ నాయకుల నివాళులు

**జలుమూరు, ఆగస్టు 20 (వార్త):** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా చల్లవానిపేట లో ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించరు. అనంతరం నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారత ప్రధానిగా సాంకేతిక విప్లవం తెచ్చి యూత్, మరియు నిరు నిరుద్యోగులుకు ఉపాధి అవకాశాలు కలిగించి జాతీయ సంపద పెంచ గలిగారని ఆయన యువతకు మార్గదర్శకులని కొనియాడారు, ఈయనతో పాటు జిల్లా పార్టీ జాయింట్ సెక్రటరీ భేరి వెంకట రమణ,కార్యకర్తలు అగరు జగ్గారావు,కడియాల రామారావు,బెలమర సంతారావు రమణ పాల్గొని నివాళులు అర్పించారు.



# వంశధార జలాలు ఇచ్ఛాపురం వరకు పొడిగించాలి



**మందస, ఆగస్టు 20(వార్త):** వంశధార సాగు జలాలను పలాస నియోజకవర్గంలోని వేపాడుచెరువు మీదుగా మందస మండలంలోని సునాముది, దామోదర సాగర్, గోపాలసాగర్, సంకుజోడు చెరువులను కలుపుతూ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని వంశధార సాగునీటి సాధన కమిటీ నాయకులు కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, వంశధార ప్రాజెక్టు సూపరిండెంట్ ఇంజనీర్లకు వినతులు అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలైన పలాస, ఇచ్ఛాపురం నియోజక వర్గాల రైతులు వ్యవసాయంపై జీవిస్తున్నారని, సకాలంలో వానలు లేకపోవడముతో రైతులు భూములు విడచి, వలస కార్మికులుగా ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దాన ప్రాంతాలు కలిగిన పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం 7మండలాలు కిడ్నీ వ్యాధులు బారిన పడి వందల కొలది ప్రజలు మరణిస్తున్నారని, వంశధార నదీ జలాలు కేవలం 10కిలోమీటర్లు దూరంలోనే ఉన్నాయని, ఈ పది కిలోమీటర్లు ఛానల్ ఏర్పాటు చేయగలిగితే మందస మండలం పాక్షికముగా, సోంపేట మండలంలో సుమారు 100గ్రామాలు సస్యశ్యామలంగా మారుతాయన్నారు. కాలువలు తవ్వగలిగితే చాలు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని గ్రామాలకు సాగునీరు చేరుతుందని, అదేవిధంగా సుమారు రూ.1800కోట్లు వ్యయం చేయగలిగితే ఇచ్ఛాపురం, పలాస ఈ రెండు నియోజకవర్గాలలో రెండు పంటలు పండి సస్యశ్యామలంతో పాటు కిడ్నీవ్యాధులు శాశ్వతంగా పరిష్కరించబడతాయన్నారు. వ్యవసాయం అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి గణనీయంగా పెరిగి దేశ జీడీపీ వృద్ధి చెందుతుందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు అప్పులు బారినపడి ఆత్మహత్యల పాల్పడుతున్నారని ప్రభుత్వాలు అర్థం చేసుకోకపోవడం రైతులు దురదృష్టంగా భావిస్తున్నామన్నారు. వంశధార రిజర్వాయర్ ప్రధాన సమస్య నేరేడు బ్యారేజు ఒడిషా, ఆంధ్ర జలాలు వాటా ప్రాప్తిగా చెరో 57.1/2 టీఎంసీలు కాగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ వాడుతున్నది కేవలం 20టీఎంసీ మాత్రమేనని మిగిలినది సముద్రంలో కలుస్తున్నదన్నారు. మిగిలిన 37.1/2టీఎంసీ నీటిని రైతులకు అందించగలిగితే శ్రీకాకుళం జిల్లా మొత్తానికి రెండు పంటలు పండి రైతులు, దేశం అభివృద్ధి జరుగుతుందన్నారు. వంశధార సరిహద్దు భూవివాదం ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్టంనకు సంబంధించినది కనుక ఈ రెండు రాష్ట్రములు ఒకే గొడుగు క్రింద ఉన్నందున సరిహద్దు సమస్య సులువుగా పరిష్కారము జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను వివరించి, వంశధారను ఇచ్ఛాపురం వరకు పొడిగించి.. పరిష్కారము చేయించగలరని కోరారు. కార్యక్రమంలో వంశధార సాగునీటి సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావ్ చౌదరి, వాయిలపల్లి మాధవరావు, దుంపల వైకుంఠ రావు, బైరిశెట్టి గున్నయ్య, ఉగ్రిపల్లి సోమనాథం పాల్గొన్నారు.

# పట్టులోగాం ఆశ్రమ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలి



-బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


-ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలి

-యూటీఎఫ్ నాయకుల డిమాండ్

**మందస, ఆగస్టు 20(వార్త):** మందస మండలం కొండలోగాం పంచాయతీ పట్టులోగాంలోని గిరిజన ఆశ్రమ బాలికొన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయునుల డిప్యూటేషన్ రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు డిమాండ్ చేశారు. మందసలో జరిగిన యూటీఎఫ్ జిల్లా ప్రాంతీయ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల మధ్య జరిగిన సంఘర్షణ విద్యార్థుల, పాఠశాల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోందన్నారు. డిప్యూటేషన్ పై పంపించిన ఉపాధ్యాయనిలను తిరిగి వారి పాత స్థానాలకు పంపించాలని, తద్వారా పాఠశాల విద్యా ప్రగతిని కాపాడగలమని వారు తెలియజేశారు. పాఠశాలపై సమగ్ర విచారణ జరపడం వలన మాత్రమే సమస్యకు పరిష్కారం అవుతుందని, అంతవరకు ఉపాధ్యాయినిలను వారి పాత స్థానాలకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు గున్న రమేష్, కంచరాన రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, మందస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, పలాస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జయరాం, ఎస్. వెంకటరమణ, జిల్లా అకాడమిక్ సెల్ కో కన్వీనర్ మాధవరావు, టి.అప్పారావు, జి.మధు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పీఎం అగ్రహారంలో కాలువలు, రోడ్లు నిర్మించాలి

**సరుబుజ్జిలి, ఆగస్టు 20(వార్త):** తెలికిపెంట పంచాయతీలో ఉన్న ఎల్పిఎం అగ్రహారంలో గ్రామంలో దళిత లు ఉన్న గ్రామం లో డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయని, చిన్న వర్షానికి రోడ్డుపై ఇళ్లలోకి బురద నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామం వాసులు అన్నారు. గత మూడు రోజుల నుండి కురిసిన వర్షానికి గ్రామం లో రోడ్డు ఇండ్ల ముందు బురద మాయమై దుర్వాసన వస్తుంది అన్నారు. ఈ సందర్భంగా అగ్రహారం గ్రామం ప్రజలు మాట్లాడుతూ దళితులు ఉన్న గ్రామాలు లో లపై వివక్ష చూపడం దారుణం అన్నారు, ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే డ్రైనేజీ రోడ్డు లు నిర్మించి దళిత కాలనీలో ఉన్న పేదలను వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని కోరారు. కొత్త డ్రైనేజీలను నిర్మించాలన్నారు. డ్రైనేజీ ఉన్న ప్రాంతాలలో పూడికతీత తీయించి బ్లీచింగ్,పిచికారి చేయించాలని గ్రామం ప్రజలు కోరారు.



# జనవాణిలో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే జయకృష్ణ



**వీరఘట్టం, ఆగస్టు 20(వార్త):** మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాల యంలో బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వినతలను స్వీకరించారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై విరివిగా విచ్చేసి అర్జీలు సమర్పించారు. పలు సమస్యలపై భారీగా వచ్చిన ప్రజల సమస్యలను ఎంతో ఓపిగ్గా విని వారికి సరైన సమాధానాలు ఇస్తూ కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్లు ద్వారా తెలియజేసి వాటిని పరిష్కరించే దిశలో ఎమ్మెల్యే చొరవ చూపారు ప్రజా సమస్యలను ఓపిగ్గా వినడంతోపాటు వారి సమస్యలను తమ సమస్యగా మలుచుకుంటూ ప్రజలు సంతృప్తి చెందే విధంగా ప్రజావాణి ని సాగించారు దీంతో వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గీత కులాలకు శ్రీకాకుళం, పలాసలో కొత్త బార్లు

**శ్రీకాకుళం, ఆగస్టు 20(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో కొత్త బార్ పాలసీ-2025 ప్రకారం రిజర్వు ఉపకులాలకు బార్లు కేటాయిస్తున్నారు. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీశయన కులానికి, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సొండి కులానికి బార్ లైసెన్సులు కేటాయించినట్లు ప్రకటన విడుదల చేసింది. రెండింటికీ వార్షిక రెంట్ రూ.27.50 లక్షలు. దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు జతచేయాలి. రూ.5 లక్షల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్, రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. దరఖాస్తులు ఆగస్టు 20 నుంచి 29 వరకు స్వీకరించగా, ఆగస్టు 30న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా కేటా యింపులు జరగనున్నాయి.

# లాభసాటి వ్యవసాయానికి సాంకేతికత అవసరం

### ❋ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం, ఆగస్టు 20 (వార్త):** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు ఆధునిక వ్యవసాయ, అనుబంధ శాఖల సాంకేతిక అవసరమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్, వప్పంగి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై రైతులుకు అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలకు పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ నుండి తయారు కాబడిన నానో కాపర్, నానో యూరియా ప్లస్, నానో డిఏపి, నానో జింక్ వంటి ఇఫ్ కో నానోఎరువులు తో పాటు, సిఐఎల్ కంపెనీ నానో డిఎపి, ఐపిఎల్ కంపెనీ వారి నానో యూరియా నానో మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయి. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్ స్ప్రేయర్లును రైతులకు పరిచయం చేశారు. ఇవన్నీ రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు., ఈ ఎరువులు గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తూ పంట నాణ్యత, ఉత్పత్తిని పెంచుతాయన్నారు. సాంప్రదాయ ఎరువుల కంటే తక్కువ ధర, నిల్వ, రవాణాలో సులభతరమన్నారు. నానో ఎరువుల స్ప్రే కొరకు ఇఫ్ కో 6 ఇఫ్ కో కిసాన్ డ్రోన్, 20 కిసాన్ డ్రోన్లు, 11 నమో దీదీ డ్రోన్లు అందుబాటులో ఉంటాయని, డ్రోన్ కొరకు ఇఫ్ కో ఫీల్డ్ ఆఫీసర్స్ ను సంప్రదించగలన్నారు. డ్రోన్ల కోసం మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు. నానో యూరియా ప్లస్, నానో డిఏపి స్ప్రేయింగ్ పై రైతుకు అవగాహన కొరకు ఏర్పాటు డ్రోన్ ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాధస్వామి, మండల వ్యవసాయ అధికారి పి. నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ చల్ల వాణిదేవి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం నగరం శుభ్రంగా ఉండాలి

శానిటేషన్ పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వార్డు సచివాలయాల ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ కార్య దర్శులు, కార్పొరేషన్ సిబ్బందితో స్వచ్ సర్వేక్షన్‌లో భాగంగా శానిటేషన్ పై బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి పైపులు పాడైతే తాగునీరు కలుషితం కాకుండా కాలువలకు దగ్గరగా ఉన్న పైపులైన్ కొంచెం దూరంగా ఉండాలని, లేదంటే తాగునీరు కలుషితమై డయేరియా, తదితరమైన వ్యాదులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. శానిటేషన్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ ముగ్గురు సమన్వయంతో కార్పొరేషన్ లో డోర్ టు డోర్ చెత్త కలెక్షన్, రోడ్లు క్లీనింగ్, రోడ్డు ప్రక్కన మట్టి పేరుకుకుపోతే దానిని తొలగించడం వంటి వాటిని చూడాలన్నారు. తాను వార్డుల్లో పర్యటిస్తానన్నారు. అక్టోబర్ 2న ఒక సచివాల యం అన్ని విధాలుగా శుభ్రత, తదితరమైన వాటిలో బాగుంటే ఉత్తమ వార్డు సచివాలయ అవార్డు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించండి

**పలాస, ఆగస్టు 20 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గల అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామారావు ఆదేశించారు. బుధవారం పురపాలక సంఘ కార్యాల యంలో ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్సు సర్వేయర్లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మున్సిపాలిటీలో 22 అనది.కార లేఔట్‌లు ఉన్నట్లు గుర్తించామని, ప్రభుత్వం కొత్త నిబంధనల ప్రకారం సదరు లేఅవుట్లను అన్నింటినీ క్రమబద్ధీకరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్త నిబంధనల ప్రకారం స్థల యజమాని అనధికార లేఔట్‌లో ఇండ్ల నిర్మాణం చేసుకొనుటకు ఒకేసారి ఫీజులు చెల్లించినట్లయితే అందులో 10శాతం రాయితీ కూడా ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను స్థల యజమానులకు వివరించి వారిని మోటివేట్ చేయాలని సిబ్బందిని ఆదేశిం చారు. ఈ సమావేశంలో పురపాలక సంఘం ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్స్ సర్వే యర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులకు సీదిరి పరామర్శ



**పలాస, ఆగస్టు 20 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, 1వ వార్డు మొగిలిపాడు గ్రామానికి చెందిన దున్న దుర్గమ్మ ఇటీవల మరణించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం దున్న దుర్గమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట 1వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి దున్న సత్యం, వైసీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, నల్ల బొడ్లూరు సర్పంచ్ ఉమాపతి, వైసీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, పట్టణ ఉపాధ్యక్షుడు నర్తు వెంకటరమణ, ఢిల్లీ మాస్టర్, కృష్ణ, నాయకులు ఉన్నారు.

## జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు



**శ్రీకాకుళం, ఆగస్టు 20 (వార్త):** జిల్లా పరిషత్ యాజమాన్యంలో సర్వీస్‌లో ఉండగానే మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించే సాంఘిక భద్రతా పథకం కింద ఉద్యోగ నియామక పత్రాలను జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం అందజేశారు. జిల్లా ప్రజాపరిషత్ బంగ్లాలో బుధ వారం జరిగిన కార్యక్రమంలో నలుగురికి జూనియర్ సహాయకులుగా నియామక పత్రాలు అందజేశారు. కొత్తగా నియమితులైన వారు క్రమశిక్షణతో పని చేసి, పని చేసే కార్యాలయానికి, జిల్లా ప్రజా పరిషత్‌కి మంచి పేరు తెచ్చేలా కృషి చేయా లని జడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా, ఉప ప్రధాన కార్య నిర్వహణా ధికారి డి. సత్యనారాయణ, సి. సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



## తాళ్లభద్ర హైస్కూల్‌కు ఫ్యాన్ల వితరణ

**పలాస, ఆగస్టు 20 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల తాళభద్ర హైస్కూల్ గ్రీన్ ఆర్మీ సభ్యులు స్కూలుకు అవసరమయ్యే సీలింగ్ ఫ్యాన్లు, మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆక్సిజన్ మార్కెట్లో కొనుగోలు చేసుకోకుండా ఉండాలంటే మొక్కలు నాటి పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధి జరగాలంటే పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు సహకారం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ కార్యదర్శి బి.తిరుమల. సభ్యులు, యువజన నాయకులు నక్క అనిల్ కుమార్, నగిరి లక్ష్మి, ఉపాధ్యాయులు మాధవి లత, విద్యాసాగర్, జయప్రద, లోకనాధం, శ్రీదేవి, హేమావతి, సాహితీ , వేదవతి, శంకర్రావు, ధనలక్ష్మి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దోమల నిర్మూలనపై అవగాహన సదస్సు

**పలాస, ఆగస్టు 20, (వార్త) :** పలాస మండలం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దోమల నిర్మూలనపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి సునీల్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో ఏ మారుమూల గ్రామం తీసుకున్న దోమల సమస్యలు అనేవి సహజంగా ఉంటున్నాయి అని, వీటిని నిర్మూలించడానికి ప్రజలు, ప్రభుత్వాలు ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమం చేయాలని, ముఖ్యంగా వారం రోజులు పైబడిన నీటి నిల్వలను తొలగించాలని అన్నారు. దోమతెరలు తప్పనిసరిగా వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు ఎక్కువగా ఉన్న యెడల మందుల పిచకారి చేయలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఆదమ్మ, సూపర్వైజర్ బి. పద్మావతి, ఫార్మసీ ఆఫీసర్ బోనెల గోపాల్, ఎస్‌టి ఎస్ సూపర్వైజర్ సేనాపతి కోటేశ్వరరావు, స్టాఫ్‌నర్స్ రాజేశ్వరి, మేరీ బాయ్, ఎల్ టి త్రివేణి, సుహాసిని పాల్గొన్నారు.



## నిర్వాసితులకు న్యాయం చేస్తాం

### ❋ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, ఆగస్టు 20 (వార్త):** రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ టీ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో బుధవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఫ్లైఓవర్ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ పెరిగిన దృష్ట్యా ఫ్లైఓవర్ ఆవశ్యకతను గుర్తించి, నిర్మాణాన్ని చేపడుతున్నామని, దీనికి స్థలాలను ఇచ్చిన 90 మందికి పట్టాలను లాటరీ పద్ధతి ద్వారా పంపిణీ చేశారు. రైల్వే నిర్వాసితులకు సూదికొండ లేబర్ కాలనీ దగ్గర స్థలాన్ని సేకరించి పట్టాలు అందజేశారు. నిర్వాసితులు తమకు కేటాయించిన స్థలంలో హద్దులు వేసుకొని రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైల్వే బ్రిడ్జి పనులు వేగవంతగా జరుగుతున్నాయని 2025 మార్చి నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస ఆర్‌డిఓ జి.వెంకటేష్, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, పీరుకట్ల విఠల్‌రావు, లోడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు,యవ్వారి మోహనరావు, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ,రవిశంకర్ గుప్తా, చంద్రశేఖర త్యాడి, గోళ్ళ చంద్రరావు,సాసుమాన చంద్రమౌళి, దడియాల నరసింహులు రెవెన్యూ సిబ్బంది, నిర్వాసితులు పాల్గొన్నారు.

## పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**పలాస, ఆగస్టు 20(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి వెంకటలక్ష్మి కోరారు. నాణ్యమైన విద్యను అందించే నిపుణులైన అధ్యాపకుల బృందం పనిచేస్తోందని తెలిపారు. బిఏ (హిస్టరీ), బిఎస్సీ (మ్యాథమెటిక్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బిఎస్సీ (జువాలజీ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్) కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పోస్టల్ విభాగంలో 12 మంది, హైదరాబాద్ ప్రైవేట్ కంపెనీల్లో 35 మంది, అగ్నివీర్ ఉద్యోగాలు పొందిన 20మంది విద్యార్థులు పొందారన్నారు. అలాగే యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్



చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యునైసెఫ్) నుండి 50 మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందారని వెల్ల డించారు. కోకో క్రీడలో ఇంటర్ స్టేట్ స్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారని చెప్పారు. ప్రవేశాలకు సంబం ధించి పూర్తి సమాచారం, దరఖాస్తు విధానం కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫోన్ 08945293642 సంప్రదించి తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** ఈదుపురంలోని బేతాళయువజన సంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఎంట్రీలు కోరుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30న నిర్వహించే క్విజ్ పోటీలకు 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. పాల్గొనే జట్లు తమ ఎంట్రీలను ఈనెల 25వ తేదీ నాటికి పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9000045663, 93 98533123 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఆసి వీధి, బేతాల యువజన సంఘం వినాయక పూజాకమిటీ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నట్లు చెప్పారు.

## జానపద దినోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** ఈదుపురం రామాలయ ప్రాంగణ ఆవరణలో మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ ఆవిర్భావం మరియు ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా జానపద సంబరాలు 24 ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటలకు మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చాపురం పట్టణం రోటరీ ఫంక్షన్ హాల్ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం దగ్గర సంగీత మరియు జానపదాలు కోలాటం, సంబల్పూరి, భూభాగతం, కోయడాన్స్ జానపద గీతాలతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ కార్యవర్గ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా జానపద సంబరాలు సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రంగాల జానకిరామ్ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనంజయ రెడ్డి, ఉపాధ్యక్షులు నర్తు గంగయ్య, ప్రచార కార్యదర్శి చలరాయి వినోద్ కుమార్, ఉప కార్యదర్శి కారింగి తులసయ్య , కోశాధికారి కొప్పల హేమంత్, ఉప కోశాధికారి కారింగి త్రినాథ్ రెడ్డి ప్రధాన సలహాదారులు తిప్పన దాలయ రెడ్డి, సలహాదారులు బొర రామారావు తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛావతి అమ్మవారి మంత్రాన్ని ఆవిష్కరించిన కమిటీ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛ వతి అమ్మవారి ఆలయంలో అష్టలక్ష్మి వ్రత పూజలు శుభ సందర్భంగా స్వేచ్ఛావతి మంత్రాన్ని స్థానిక వెంకటేశ్వర క్రియేషన్స్ కళాబృందం వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ అధ్యక్షులు మరియు బృందం జయలక్ష్మి పట్నాయక్, బలివాడ భవాని ,అనపన కుమారి, బల్లెడ శరణ్య ,బల్లెడ శ్రీదీక్షిత, లక్కోజు జీవిత లు వారి స్వరంతో శ్రావ్యంగా ఆలపించిన మంత్రాన్ని ఆగమపండితులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్య స్వామి వారు మరియు స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సమక్షంలో ఆవిష్కరించారు. అష్టలక్ష్మి వ్రత పూజల్లో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నాట్య గురువులు బలివాడ శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో డాన్స్ టీచర్స్ దట్టి కావ్య. నీలాపు శైలు. సిల్లా పూజ. చాట్ల జయలక్ష్మి. ఆసిపు శ్వేతారాణీ.. పల్లవి. దీపిక. జైత్రీకాధ్యాయని అష్టలక్ష్మిలుగా తయారై అష్టలక్ష్మి సుమనస వందిత. స్తోత్రాన్ని నాట్యం చేసి భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్నారులను సత్కరించారు.

## యోగా పోటీల్లో జ్ఞానభారతి విద్యార్థి ప్రతిభ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** నరసన్నపేటలో ఈ నెల మూడున జరిగిన నేషనల్ యోగ స్కూల్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీలలో పట్టణానికి చెందిన పాలేపు సాయి జగదీష్ అండర్-14 యోగా విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. తాడేపల్లిగూడెం లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి యోగ పోటిలకు వెళుతున్న సందర్భంగా జ్ఞాన భారతి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సీఈవో జోహార్ ఖాన్ విద్యార్థి సాయి జగదీష్ ను అభినందించారు.

రాష్ట్రస్థాయి నేషనల్ స్థాయిలో మరిన్ని పథకాలు సాధించి జ్ఞాన భారతి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, వ్యాయమ ఉపాధ్యాయులు కైలాష్ కుమార్, రాము అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డిపోల్లోని కొలతల్లో తేడా ఉండరాదు



**నరసన్నపేట, ఆగస్టు 20(వార్త):** నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో బుధవారం డీటీ రామకృష్ణ సమావేశం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ఫుడ్ కమిటీ మెంబర్ పర్యటన సందర్భంగా రేషన్ డిపోల్లో లోపాలు గుర్తించారని డీటీ చెప్పారు. తూనికలు, కొలతల్లో తేడాలు ఉండరాదని, లోపాలను గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహశీల్దార్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.



## రత్తకన్న సమస్యలు పరిష్కరించండి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** మున్సిపాలిటీ పరిధి 18 ,19 మరియు 20 వార్డు రత్తకన్న సమస్యలు పరిష్కరించాలని 20 వార్డు తెలుగుదేశం సీనియర్ నాయకుడు సుభాష్ రౌలో కోరారు. ఈ మేరకు న్యూ ఢిల్లీ ఆంధ్రా భవన్ లో నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ కి వినతిపత్రం అందజేశారు. రోడ్లు, కాలువలు నిర్మించాలని క్వారీ రోడ్డు నిర్మించాలని, స్మశాన వాటిక ,చెరువులు అభివృద్ధి చేయాలని కోరారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బదిలీపై ఉపాధ్యాయులు ఎస్ పూర్ణచంద్రరావు, గణపతికి కొల్లిపాడు నందు సన్మానం చేశారు. ప్రధానోపాధ్యాయిని డి.లత, కుమారస్వామి, సృజన, జిల్లా పరిషత్ హెచ్ఎం రామారావు, గ్రామ పెద్దలు ధర్మార్జునారెడ్డి, కృష్ణారావు, రెడ్డి రామారావు సర్పంచ్ ఉషారాణి, సవరయ్య దంపతులు పాల్గొన్నారు.

## రైల్వే ఫ్లైఓవర్ డిజైన్ మార్చండి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** రత్తకన్న ఎల్ సి గేటు వద్ద కొలిగం రోడ్డు లో నిర్మిస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి డిజైన్ మార్చాలని పట్టణ సీనియర్ తెలుగుదేశం నాయకులు కాళ్ల అర్జున్ కోరారు. వి కె పేట రోడ్డు లో భారీ వాహనాలు కు అనుమతి లేకుండా డంపింగ్ యార్డ్ పక్కన నుంచి బ్రిడ్జి పై మార్గం కల్పించాలని కోరారు. కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లు,ఆటో లకు మాత్రమే అనుమతి ఇచ్చేలా రెండు మార్గాలు కల్పించాలని కోరారు. గతంలో భారీ వాహనాలు వల్ల ప్రమాదాలు అధికంగా జరిగాయని, నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తో వి కె పేట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

## ఈదుపురంలో సద్భావన్ దివస్

**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** ఈదుపురం గ్రామంలో బెహరా వీధిలో, మేర యువ భారత, నెహ్రూ యువ కేంద్ర శ హంగిరి బేహరా ఆధ్వర్యంలోసద్భావన దివస్ నిర్వహించారు. దీనిని సామరస్య దినోత్సవం అని కూడా పిలుస్తారు, దీనిని భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 20న జరుపుకుంటారు . ఇది జాతీయ సమైక్యత, శాంతి మరియు సామరస్యాన్ని ప్రోత్సహించడానికి అంకితం చేయబడిందనిమరియు మాజీ భారత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించబడుతుందని చెప్పారు. ప్రజలు సద్భావనను పెంపొందించుకోవడానికి మరియు హింసను విడనాడడానికి ప్రోత్సహిస్తుందని అన్నారు.కార్యక్రమంలో స్వదేశీ మత్స్య కారులు, ఉపసర్పంచ్, గ్రామ వార్డు మెంబర్ యువకులు స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546